నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.
ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..
గుడ్డిబౌలి, చంచల్‌గూడ, జాంజాం మెడికల్‌హాల్, మదీన మజీద్, అజంపురా చమాన్, షహీపా మజీద్, అజంపురా పోస్టాఫీస్ లేన్, అజంపురా కాంట, సీ–క్లాస్, తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారా నగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్‌మెంట్స్.
మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..
డబీర్‌పురా బ్రిడ్జి, షా కాలనీ, ముంతాజ్, డైనమిక్ స్కూల్, మినాజ్ స్కూల్, గౌసియా మజీద్, 7 టెంపుల్ వ్యూ, వార్డ్ ఆఫీస్, డీసీ పటేల్ కాలనీ, మిలాద్ గల్లీ, ఓల్డ్ ఆర్టీఏ ఆఫీస్, ఫ్రెండ్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

అవేర్ సంస్థ సేవలు అమోఘం


మాధవన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

లింగోజిగూడ: అవేర్ స్వచ్ఛంద సంస్థ 50వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి బైరామల్ గూడలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానకొండూరు ఎమ్మెల్యే కే.సత్యనారాయణ మాట్లాడుతూ.. 1975లో పేదలకు సేవా చేయాలనే దృక్పథంతో స్థాపించిన అవేర్ సంస్థ ఇప్పుడు ఆసియాలోనే అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు. అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎంతో మంది పేదల ఆకలి తీర్చడంతో పాటు ఉన్నత విద్యకు సహాయ సహకారాలు అందజేస్తోందని కొనియాడారు. అనంతరం సంస్థ చైర్మన్ మాధవన్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



దిల్‌సుఖ్‌నగర్: గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొటెక్షన్ ఫర్ రైట్స్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ (పీఆర్ఐఏ) రాష్ట్ర అధ్యక్షుడు మేకల వెంకట్‌రెడ్డి విద్యాశాఖ అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపేటలోని అష్టలక్ష్మి దేవాలయం సమీపంలో ఒకే భవనంలో కొనసాగుతున్న మూడు కళాశాలలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుర్తింపు లేకుండా నిబంధనలు ఉల్లంఘించి నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆర్‌జేడీ, రంగారెడ్డి జిల్లా డీఐఈఓకు సోమవారం ఫిర్యాదు చేశారు.

చదువుకుంటేనే భవిష్యత్


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సురేందర్‌రెడ్డి

హస్తినాపురం: విద్యతోనే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతారని, చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందని చాంద్రాయణగుట్ట మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి అన్నారు. నందనవనంకాలనీలోని చాంద్రాయణగుట్ట మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో సోమవారం మైనార్టీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, అధ్యాపకులు దిలీప్‌రెడ్డి, డేనియల్, కృష్ణవేణి, బాలసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

మరణిస్తూ ముగ్గురికి ప్రాణదానం


సింగిశెట్టి భాస్కర్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడు ఓ ప్రైవేటు ఉద్యోగి. జీవన్‌ధాన్ ప్రతినిధుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల విద్యానగర్‌కాలనీకి చెందిన సింగిశెట్టి భాస్కర్ (47) ఈ నెల 7న రాత్రి 11.30లకు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్ కామినేని హస్పిటల్‌కు తరలించగా ఈ నెల 9న బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌ధాన్ ప్రతినిధులు, భాస్కర్ భార్య రాణితో పాటు కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో భాస్కర్‌వి రెండు కిడ్నీలు, లివర్‌ను దానం చేసేందుకు ఒప్పుకున్నారు.

పాఠశాల స్థలం పరిశీలన


పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నాగోలు: బండ్లగూడ ప్రభుత్వ పాఠశాలకు కబ్జా గురించి అధికారుల దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాగోలు డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మంజులరెడ్డి అన్నారు. బండ్లగూడ సర్వేనెంబర్ 36/6లో పాఠశాల కోసం కేటాయించిన స్థలాని ప్రైవేట్ వ్యక్తులు పాఠశాల ప్రహరీ కూల్చి అక్రమ నిర్మాణాలు చేస్తున్న విషయం తెలుసుకొని పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులతో కలిసి సదరు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంజుల రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు!

- పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–1,2లో నిలిచిపోయిన పనులు
- రాకపోకలకు ఇబ్బందులు
- పూర్తి చేయాలంటున్న కాలనీవాసులు
- విస్మరిస్తున్న అధికారులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధి హస్తినాపురం డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఆయా కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్ పరిధిలోని పిండి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్–1, 2లో చేపట్టిన పనులను అర్ధంతరంగా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–1లో వేసిన రోడ్డు గత కొన్ని నెలలుగా అసంపూర్తిగా ఉండడంతో నిత్యం నరకం చూస్తున్నామని స్థానికులు వాపోతున్నారు.


కాలనీలో ప్రధాన రహదారిని తవ్వి వదిలేసి దృశ్యం


తక్కువ లోతులో వేసిన పైపులైన్


పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–1లో నిలిచిపోయిన రోడ్డు పనులు

రూ.80 లక్షలతో..

పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–2లో నెల రోజులకు పైగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపు రూ.80 లక్షలతో చేపడుతున్న వరదనీటి కాలువ పనులకు అడ్డంగా వాటర్ పైపులైన్ రావడంతో రెండు ఫీట్ల లోతులో వేయాల్సిన పైపులైన్ కేవలం ఆరు ఇంచుల లోతులో వేసి నాసీరకం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టానుసారంగా చేపడుతూ కాలనీవాసులను ఇక్కట్లకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ట్రాఫిక్ జామ్

నిత్యం రద్దీగా ఉండే పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–2 ప్రధాన రహదారిపై వేసిన సీసీ రోడ్డును ఇష్టానుసారంగా తవ్వడంతో, వివిధ కాలనీలకు, పిండి పుల్లారెడ్డి గార్డెన్‌కు శుభ కార్యాలయాలకు వెళ్లాలన్నా ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి..



అర్ధంతరంగా నిలిచిపోయిన పనులను సత్వరమే పూర్తి చేయాలి. పిండినారాయణరెడ్డి కాలనీ ఫేజ్–1,2 మార్గాల్లో వెళ్లాలంటే సాహసం చేయాల్సింది. దీనికి తోడు అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక తూతూ మంత్రంగా చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షిస్తూ పూర్తయ్యేలా చొరవ చూపాలి.
- నీలా మధుసూదన్‌గుప్తా, ఫేజ్–1 అధ్యక్షుడు

122 మంది ఓటు నమోదు

చాదర్‌ఘాట్: రెండ్రోజుల పాటు జరిగిన ఓటరు నమోదులో మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో 122 మంది ఓటు నమోదు చేసుకున్నట్లు డీసీ సంజయ్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షిఫ్టింగ్‌కు రెండు దరఖాస్తులు రాగా, చిరునామాల మార్పుచేర్పులకు ఐదు దరఖాస్తులు వచ్చాయన్నారు.

అవార్డు ప్రదానం



నాగోలు: నగరంలో సోమవారం నిర్వహించిన తెలుగు సాహిత్య కళాపీఠం 14వ ఆవిర్భావ దినోత్సవంలో నాగోలుకు చెందిన గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్‌గౌడ్‌కు విశిష్ట సేవా భూషణ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

సంతోష్‌నగర్: ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సూచించారు. ఇటీవల ఆలయాల్లో జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో సోమవారం ఐ.ఎస్.స్టేషన్ పరిధిలోని భారత్ గార్డెన్‌లో పీస్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ పాటిల్ కాంతిలాల్ మాట్లాడుతూ..ఇటీవల ఆలయాల్లో జరుగుతున్న వరుస ఘటనలతో ఆలయాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

దిల్‌సుఖ్‌నగర్: రక్తదానం ప్రాణదానంతో సమానమని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. కార్తీక ద్వితీయ సోమవారం సందర్భంగా ఆర్‌కేపురంలోని శ్రీ శైవక్షేత్ర పీఠంలో శ్రీ శివస్వామిజీ జయంత్యుత్సవాల సందర్భంగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడుస్తూ సామాజిక సేవ చేయాలన్నారు. శివస్వామి మాట్లాడుతూ.. భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లని వేలాది సంవత్సరాలు మనులు, స్వామీజీల నుంచి మనకు వారసత్వంగా వచ్చిన ఆచార సంప్రదాయాల పరిరక్షణ, హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ. కుమార్, హేమ, కోటేశ్వరావు, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్, సాంబమూర్తి, గోపాల్, సత్యలక్ష్మి, రేణుక, నాగలక్ష్మి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

బస్తీల్లో వసతుల కల్పనకు కృషి



సైదాబాద్: డివిజన్ పరిధిలోని బస్తీల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్త కాపు అరుణరవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది, బస్తీవాసులతో కలిసి గాంధీనగర్ ఎస్టీ బస్తీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. సైదాబాద్‌లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనుల ఆధునీకరణ పూర్తయితే అన్ని ప్రాంతాల్లో నూతన రహదారి పనులు చేపడుతామన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ వెంకన్న, రాజారామ్, దిలీప్, రవి, సుభాష్, నాని, శ్రీరాం ఉన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ ఎంసీఆర్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సోమ వారం బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేనంబర్ 139లో కాలనీకి ప్రవేశించే ప్రధాన రహదారిని బీఆర్‌ఎస్ నాయకుడు కబ్జా చేసి, దుకాణాలు నిర్మించాడని ఆరోపించారు. ఇదే కాలనీలో ప్రజలు, కాలనీవాసుల అవసరాల కోసం మూడు ప్లాట్ల ఓపెన్ స్థలాలను (2160 చదరపు గజాలు) వదిలిపెట్టారని తెలిపారు. ఈ ఖాళీ స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని, సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కంచె వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సైదులు, మహేందర్ తదితరులు ఉన్నారు.



14న పాస్టర్స్ అసోసియేషన్ సమావేశం

మలక్‌పేట: ఈ నెల 14న మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం తెలిపారు. అస్మాన్‌ఘడ్ బాప్టిస్టు చర్చిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే సమావేశంలో ఫిఫ్త్ గాస్పెల్ మినిస్ట్రీస్ పాస్టర్ రెవరెండ్ ఎం. సురేష్ ముఖ్య అతిథిగా హాజరై వ్యాకోపదేశం అందిస్తారని పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు హాజరు కావాలన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న నాగరాజు

మలక్‌పేట: విప్లవ విద్యార్థి అమరుల ఆశయ సాధనకు పోరాటం కొనసాగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ ఆధ్వర్యంలో సోమవారం దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన పీడీఎస్‌యూ విద్యార్థి అమర వీరుల వర్ధంతి సభకు హాజరైన ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 సంవత్సరాల కాలంలో సమాజ స్థాపన, శాస్త్రీయ విద్య సాధనకై జరిగిన పోరాటంలో విద్యార్థులు తమ రక్తాన్ని చిందించారన్నారు. అమరులైన జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్ చూపిన బాటలోనే నూతన జాతీయ విద్యా విధానానికి, విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రాజు, శ్రీజ, శిరీషా పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు. టమాట రూ. 23, వంకాయ రూ. 55, బెండ రూ. 55, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 32, బీర రూ. 40, క్యాబేజి రూ. 35, ఫ్రెంచి బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 70, దొండ రూ. 28–35, చిక్కుడు రూ. 45–70, గోకర రూ. 40, బీట్‌రూట్ రూ. 55, క్యాప్సికం రూ. 75, ఆలు రూ. 37, దోస రూ. 35, సొర రూ. 15, పొట్ల రూ. 18, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 35.
ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

5200 ఇళ్ల సర్వే పూర్తి

చాదర్‌ఘాట్: గత మూడ్రోజుల నుంచి మలక్‌పేట సర్కిల్–6లో దాదాపు 5200 ఇళ్ల సర్వే పూర్తయినట్లు డీసీ సంజయ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి యజమానులు పూర్తి వివరాలు ఇవ్వడం లేదని మొత్తం 73 ప్రశ్నలు ఉండటంతో విసుక్కుంటున్నారని ప్రతి ఇంటికి గంట సమయం పడుతుందన్నారు. ప్రతిరోజు సర్వే వివరాలను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నామని సర్వే అధికారులు ఇంటికి రాకపోతే 9989930281 ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

సర్వేను విజయవంతం చేయాలి..

చాదర్‌ఘాట్: సమగ్ర సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేను కొంత మంది బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సర్వే అధికారులకు సహకరించి విజయవంతం చేయాలన్నారు.


వివరాలు సేకరిస్తున్న అధికారులు

పూర్తి వివరాలు ఇవ్వాలి..

చాదర్‌ఘాట్: కులగణన సర్వేలో దివ్యాంగులు తమ పూర్తి వివరాలు ఇవ్వాలని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ విద్యా, వైద్య, జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ప్రగతినగర్‌కాలనీ పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ అవసరాల దృష్ట్యా వదిలిన స్థలాన్ని లేఅవుట్ చేసిన వ్యక్తి కబ్జా చేయడానికి యత్నిస్తున్నాడని ఆరోపించారు. సదరు స్థలంలో రూ.15.25 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయన్నారు. తప్పుడు పత్రాలు సృష్టించి స్థలం నాది అంటూ కబ్జాదారుడు కాలనీవాసులను బెదిరింపులకు గురి చేస్తున్నాడని సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. గతంలోనూ కబ్జాకు యత్నించగా అడ్డుకోవడంతో వెళ్లిపోయాడని ఇప్పుడు మళ్లీ మరోసారి కబ్జాకు తెర లేపుతున్నాడన్నారు. వినతి ఇచ్చిన వారిలో కాలనీవాసులు రాంరెడ్డి, సైదిరెడ్డి, సతీష్‌గోయల్, వెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న నర్సింహారెడ్డి

ప్రధానోపాధ్యాయుడిపై జేసీకి ఫిర్యాదు


వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లింగోజిగూడ: హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న గేటు పడి బాలుడు అజయ్ మృతి చెందిన ఘటనలో ప్రధానోపాధ్యాయుడిని వెంటనే తొలగించాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఘటనా స్థలాన్ని పరిశీలించకుండా కలెక్టర్ బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కారకులైన వారిని శిక్ష నుంచి తప్పించారని ఆరోపించారు. గేటు శిథిలావస్థలో ఉన్నా హెచ్‌ఎంతో పాటు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బాలుడు మృతి చెందాడని ఆరోపించారు. విద్యార్థులంతా ఇంటికి వెళ్లిన తర్వాతే వెళ్లాల్సిన సిబ్బంది విద్యార్థుల కన్నా ముందే ఇంటికి వెళ్లిపోయారని తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో సాయి కుమార్, నందిగామ వెంకటేశ్, చిరుమర్తి శేఖర్, సభావత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గూగుల్‌లో సెర్చ్ చేస్తారు.. చోరీలకు పాల్పడుతారు

దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి రిమాండ్

నాగోలు: జల్సాల కోసం దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గ జిల్లా, చించోలి తాలూకా, చిమ్మాయి డై గ్రామానికి చెందిన ఉమేష్ (23) కార్తీక్(20), నితిన్‌కుమార్ అలియాస్ మిట్టు(20) ముగ్గురు కలిసి చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఆలయాల్లోని హుండీల్లోని నగదును అపహరించాలని పథకం పన్నారు. నగరానికి వచ్చి గూగుల్ ద్వారా దేవాలయాలు ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడే తక్కువ ధరలున్న లాడ్జీల్లో ఉండేవారు. సాయంత్రం వేళల్లో రెక్కీ చేస్తూ అర్ధరాత్రుల్లో ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి నగదు చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 25న మన్సూరాబాద్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని శ్రీ ఉమా లింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి నగదును దోచుకెళ్లడంతో ఆలయ మేనేజర్ లింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు చోరీలు చేస్తున్న వారిపై నిఘా పెంచారు. సోమవారం తెల్లవారుజామున ఎల్‌బీనగర్ డీఎం కళాశాల వద్ద సిరిస్ రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా అప్పుడే ముగ్గురు ద్విచక్రవాహనంపై వచ్చారు. పోలీసులను గమనించి ద్విచక్ర వాహనం వదిలేసి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా వెంబడించి పట్టుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా గతంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయిబాబా ఆలయంలో ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి నగదు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ. 40 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనం, ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.



ప్రత్యేక పూజలు

కార్తీక మాస రెండో సోమవారం పురస్కరించుకుని నాగోలు డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన పుష్పార్చన కనుల పండువగా నిర్వహించారు. కాలనీవాసులు గణేష్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, కృష్ణమూర్తి, రమణమూర్తి, మురళీ, అజయ్, కేశవులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. –మన్సూరాబాద్



ప్రత్యేక ఆకర్షణ



ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని ఫ్లైఓవర్స్, అండర్‌పాస్ గోడలకు వేసిన పెయింటింగ్స్‌ను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. నగరానికి ముఖద్వారమైన ఎల్‌బీనగర్‌లో రోడ్లు అందంగా తీర్చిదిద్దుతున్నామని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ గోడలపై వేసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. –మన్సూరాబాద్